క్లుప్తంగా

ఎమ్మెల్యే విష్ణుకు సన్మానం




అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కాపుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు చూపుతున్న చొరవ మరువలేనిదని కాపు సంఘం నాయకులు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. ఎల్‌బీఎస్ నగర్‌లో కోటి రూపాయల వ్యయంతో కాపు కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో కాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే మల్లాది విష్ణును శనివారం సన్మానించారు. కాపు కల్యాణమండపం కోసం గత ప్రభుత్వం చేయలేని కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కాపు సామాజికవర్గ అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. కాపు సంఘం నాయకులు శనగశెట్టి హరిబాబు, భోగాది మురళి, బత్తుల దుర్గారావు, కమ్మిలి రత్నకుమార్, పసుపులేటి బుచ్చిబాబు, ఎంఎస్ నాయుడు, కొప్పిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

4 నుంచి మహిళా ఉత్సవ్-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మార్చి 4 నుంచి 12 తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో మహిళా ఉత్సవ్-2023 నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ తెలిపారు. మహిళలు తయారు చేసిన ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ చీరలు, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బొమ్మల తయారీ మొదలైన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. మహిళా ఉత్సవ్‌లో తమ ఉత్పత్తులను విక్రయించాలనుకునే వారు ఈ నెల 28వ తేదీ మంగళవారంలోపు మొగల్రాజపురం, రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశించిన సమయంలో రోడ్లు పూర్తి చేయాలని కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ పెనుమత్స సత్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు స్వరాభిషేకం



విజయవాడకల్చరల్: హైదరాబాద్‌కు చెందిన గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘంటశాల శత జయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం అమృతగానం- అమృత స్వరం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. రెండు గంటల పాటు సాగిన కార్యక్రమంలో ఘంటసాల మాష్టరు స్వరపరచిన, ఆయన గానం చేసిన గీతాలను హైదరాబాద్‌కు చెందిన బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, సాయి మేఘన, శిరీష కాకినాడకు చెందిన పీవీ రమణ ఆలపించారు. కార్యక్రమాలను పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు. కళాకారుల కృషిని అభినందించారు. గోకులం సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు వై.సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ప్రతీ నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గాయకులు బాలకామేశ్వరరావు, పీవీ రమణలను సత్కరించారు.

వార్డు వలంటీర్లకు రేపు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ దశలో జరిగే ఈ ఎంపికలో 69 మంది వార్డు వలంటీర్లకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు స్పెషల్ ఆఫీసర్(వార్డు సెక్రటరియట్స్), వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్, ఫోన్ నంబర్ 81859 33187లో సంప్రదించాలని సూచించారు.

ఆకలి తీరుస్తున్న అన్న సంతర్పణ సమితి ట్రస్ట్



భోజనాలు వడ్డిస్తున్న అన్నసంతర్పణ సేవా సమితి సభ్యులు(ఫైల్)

- 2021లో ట్రస్ట్ ఏర్పాటు
- 180 మంది వ్యవస్థాపక సభ్యులు
- రోజుకు 400 మందికిపైగా అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనిషి మనుగడ ఆహారంపై ఆధారపడి ఉంది. భోజనం లేక ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నదానం జీవన్ముక్తికి సోపానం. జీవులకు తాను అన్నమై ఉన్నానని భగవద్గీతలో స్వయంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. అన్నార్తుల ఆకలి తీర్చడంతో ఆ పరమాత్ముడిని చేరడానికి సులువైన మార్గమని నమ్మి అన్న సంతర్పణ సమితి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు. ట్రస్ట్ ద్వారా కొన్ని వందల మందికి దాతలు, వలంటీర్లు సభ్యులుగా చేర్చి నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో 400 మందికిపైగా పేదలకు, భిక్షులకు ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు.

తొమ్మిది మందితో ప్రారంభమై..

2021వ సంవత్సరం మే 23న కోవిడ్ సెకండ్ వేవ్‌లో కేవలం తొమ్మిది మందితో ప్రారంభమైంది. దాతలు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు, పెద్దలు జయంతి, వర్ధంతి ఇలా అనేక కార్యక్రమాలకి వారే స్వయంగా వచ్చి తమ స్వహస్తాలతో వేడి వేడి అన్నం, కూరలు వడ్డించి తృప్తిచెందుతున్నారు.

గురువు స్ఫూర్తితో..

రెండేళ్లుగా గుండు దిలీప్ గురువు చిత్ర స్టూడియోస్ అధినేత మద్ది వెంకట రామ మోహనరావు ఇచ్చిన ధైర్యంతో ప్రతి రోజు 100 మందికి అన్నం పెడదామని మొదలుపెట్టిన మహాయజ్ఞం ఈ రోజు అందరి సహాయంతో కొన్ని వందల మందికి అన్నం ప్రతిరోజూ పెడుతున్నారు. దాతల సహాయంతో వీలైనంత ఎక్కువ మందికి పూర్తి భోజనం అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. తన సొంత వ్యాపారాన్ని సైతం పక్కన పెట్టి ఈ సంస్థ పురోగతికి పూనుకున్నారు గుండు దిలీప్. వారి సేవలు మెచ్చి 180 మంది వ్యవస్థాపక సభ్యులుగా చేరడమే కాక, శ్రీదేవి సాంస్కృతిక సంఘం ద్వారా డొక్క సీతమ్మ అవార్డు, ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్సిటీ, హోసూర్ గౌరవ డాక్టరేట్ అందించారు.

దుప్పట్లు, చెప్పుల పంపిణీ

వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, చెప్పులు అందజేస్తున్నారు. పిల్లల్లో నైపుణ్యత పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. త్వరలో అధునాతన సౌకర్యాలతో వంటశాల ఏర్పాటు చేసి ఇంకా ఎక్కువ మందికి భోజనం ఉచితంగా అందించటానికి కృషి చేస్తున్నట్లు దిలీప్ తెలిపారు.

దేశాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం



ఐసీఏఐ విజయవాడ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): దేశాభివృద్ధిలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని సివిల్ సప్లైస్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చార్టెడ్ ఎకౌంటెంట్స్ విజయవాడ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురునానక్ కాలనీలోని ఎస్ఏసీ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. చార్టెడ్ ఎకౌంటెంట్స్ తమ విభాగంలో మెరుగైన సేవలందించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరచటంలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ నిబద్ధతగా పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు తోడ్పాటు అందించాలని సూచించారు. విజయవాడ బ్రాంచ్ వరుసగా మూడో సారి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. విజయవాడ నూతన కమిటీ చైర్మన్‌గా వీర్ల నరేంద్రబాబు, వైస్ చైర్మన్‌గా నిట్ల రవికిషోర్, కార్యదర్శిగా కంచమరెడ్డి నారాయణ, కోశాధికారిగా ఉప్పులూరి జయంత్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దక్షిణ భారత ప్రాంత చైర్మన్ పున్నారావు, సీఏలు ప్రసన్న కుమార్, శ్రీధర్, చిన్న మస్తాన్, సునీల్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ జగనన్న ఆసరా



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పేదరికంతో... ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్న ప్రతి నిరుపేద కుటుంబానికి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆసరా'ను కల్పించి, పేద ప్రజల గుండె ధైర్యంగా మారారని సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన జాస్తి ఉమాదేవి అనే మహిళ ధీమా వ్యక్తంచేసింది. 58వ డివిజన్ 259వ వార్డు సచివాలయం పరిధిలోని నూకాలమ్మ గుడి, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజలు పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు.

ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి

ఉమాదేవి అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వంగా పేరొందిందని, ముఖ్యమంత్రి జగనన్న దీవెన వల్ల తమకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి పథకాలతో పాటు సొంత ఇల్లు కూడా వచ్చిందని ఆనందం వ్యక్తంచేసింది. జగనన్న హయంలోని ఈ మూడున్నరేళ్ల కాలంలోనే తన కుటుంబానికి రూ.9 లక్షలకు పైగా సహాయం చేకూరిందని, మాలాంటి లబ్ధిదారులందరూ జగనన్నకు అండగా నిలుస్తామని తెలిపారు. షేక్ కాలేషా అనే వ్యక్తి మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా, వాహనమిత్ర, విద్యా దీవెన, వసతి దీవెన, ఇంటి స్థలం వచ్చాయని, మా ఒక్క కుటుంబానికే జగనన్న ప్రభుత్వం రూ.7 లక్షలకు పైగా ఆర్థిక సహాయాన్ని అందించిందని, మా కుటుంబం అంతా చాలా సంతోషంగా ఉన్నామన్నారు. పోలిశెట్టి శివ పార్వతి అనే మహిళ మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ప్రజలు, ప్రజలంటే ప్రభుత్వం అనే మాటకు నిలువెత్తు నిదర్శనమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, పెన్షన్ కానుక, సున్న వడ్డీ పథకాల ద్వారా లక్షా ఇరవై వేల వరకూ తనకు సహాయం అందిందని తెలిపింది. పేదలందరికీ 'జగనన్న' మేలు చేస్తున్నారని ప్రభుత్వ సేవలను కొనియాడారు.

లోకేష్ తీరు మారలేదు..

సీఎం జగనన్న పాలన నభూతో నభవిష్యత్ అన్నట్లుగా ఉందని, గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్తుంటే ప్రభుత్వంపై ప్రజలు చూపుతున్న ప్రేమ సంతృప్తినిస్తున్నాయని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దేశంలో వస్తున్న మంచిపేరును చూసి టీడీపీ ఓర్వలేకపోతుందని, టీడీపీ హయంలో ఒక్క లోకేష్‌కు తప్ప ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా అని ప్రశ్నించారు. మంగళగిరి ప్రజలు ఆ ఉద్యోగాన్ని కూడా ఊడగొట్టినా లోకేష్ తీరు మారలేదన్నారు. గన్నవరం పర్యటనలో చంద్రబాబు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడడం సరికాదని, పోలీసు వ్యవస్థను కించపరిచేలా చంద్రబాబు, టీడీపీ నాయకులు మాట్లాడడం వారి అనాగరిక ప్రవృత్తికి అద్దం పడుతోందన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ప్రజల్లో జగనన్న ఇంతటి చెరగని ముద్రను వేసుకోవడంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెబుతున్న వారు జగనన్నను ఒంటరిగా ఎందుకు ఢీకొనలేకపోతున్నారో చెప్పాలని నిలదీశారు. ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఎంత బురదజల్లినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరీ, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, వసంత్, శోభనాలు, శామ్యూల్, జాన్‌కుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



మధురానగర్‌లో మసీదు పునర్నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతి అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. స్థానిక మధురానగర్ ఆర్‌యూబీ సమీపంలోని మసీదు పునర్నిర్మాణం కోసం స్థానిక మత పెద్దలతో కలిసి శనివారం నూతన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రుహుల్లా మాట్లాడుతూ.. మసీదు నిర్మాణం అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి త్వరలోనే పనులు చేపడతామన్నారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మసీదుల నిర్మాణానికి, ఖబరస్తాన్‌ల అభివృద్ధి పనులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో విజయవాడ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు మస్జిద్ ఏ సిద్ధిఖీ, మసీదు ప్రెసిడెంట్ పఠాన్ షరీఫ్ ఖాన్, సెక్రటరీ షేక్ ఖాజావలి, వైస్ ప్రెసిడెంట్ రఫీ ఉల్లా ఖాన్, ట్రెజరర్ ముస్తఫా, మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గిరిపురంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె శనివారం గిరిపురంలో సందర్శించి పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు చెప్పగా, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. అంతేకాకుండా డివిజన్‌లో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా మెహర్‌బాబా జయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆధ్యాత్మికత మనిషిని పరమోన్నతమైన మార్గానికి తీసుకువెళ్లే ఆలంబన అని దిశానిర్దేశనం చేసిన మహనీయులు మెహర్ బాబా అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ముత్యాలంపాడు అవతార్ మెహర్‌బాబా మందిరంలో శనివారం అవతార్ మెహర్ బాబా 129వ జయంతి ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవులంతా ఒకటేనని, తోటివారిని సంతోష పెట్టడంలోనే నిజమైన ఆనందం ఉన్నదని చెప్పిన మానవతావాది మెహర్ బాబా అని పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు, పేదవారికి, మానసిక వ్యాధులతో బాధ పడుతున్నవారికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. బాబా బోధనలు డిస్కోర్సెస్, గాడ్ స్పీక్స్ అనే పుస్తకాలలో పొందుపరచబడ్డాయని తెలిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తి, మందిర నిర్వాహకులు, మేడిశెట్టి మెహర్, పెద్ద సంఖ్యలో మెహర్ బాబా భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆక్రితి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మగువల మనసును దోచే వస్త్రాలతో ఎంజీరోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆక్రితి లైఫ్‌స్టైల్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలోని దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్ చీరలతో 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆదివారం కూడా ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకురాలు శశి మెహతా తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె శనివారం గిరిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం అందించాలి



గాయకుడు రసూల్‌బాబును సత్కరిస్తున్న రమాసత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: కళాకారులు, నటులు, గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం అందించాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ విడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో త్రిభాషా గాయకుడు రసూల్‌బాబు గాయకునిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. నగరంలో 50 పైగా సాంస్కృతిక సంస్థలున్నాయని వారు కళాకారుల సంక్షేమం కోసం కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసముందన్నారు. డ్రీమ్ ఆడియో వ్యవస్థాపకుడు దావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. సంస్థ పక్షాన గాయకుడు రసూల్‌బాబును నిర్వాహకులు సత్కరించారు. రసూల్‌బాబు మాట్లాడుతూ కళా సంస్థల ప్రోత్సాహంతోనే 25 ఏళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. సత్కార కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, కొప్పరపు బలరామకృష్ణ మూర్తి పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

దినత్రయ చతుర్వేద మాస పారాయణం ప్రారంభం



పారాయణం చేస్తున్న వేద పండితులు


మధురానగర్(విజయవాడసెంట్రల్): టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన ప్రజలు సుభిక్షంగా ఉండాలని అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో దినత్రయ చతుర్వేద మాస పారాయణం శనివారం ప్రారంభమైంది. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వేద పండితులు శ్రీరుద్రమును పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్లపల్లి శివశర్మ శ్రౌతి పర్యవేక్షించారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): మానవ జీవితంలో వృద్ధాప్య దశ చాలా కీలకమైనదని, జీవితం చివరి దశలో ఉన్న వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఐదో ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.రాజారాం పేర్కొన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని అమ్మప్రేమ ఆదరణ సేవా సంస్థలో 'న్యాయ విజ్ఞాన సదస్సు' శనివారం జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృద్ధుల కోసం ఉన్న చట్టాలను వివరించారు. వృద్ధాశ్రమ సేవలను ఆయన కొనియాడారు. అనంతరం ఓ నిరుపేద కుటుంబానికి అమ్మ ప్రేమ ఆదరణ సేవా సంస్థ ఆర్థిక సహాయంతో అందించిన ఇస్త్రీ బండిని రాజారాం చేతుల మీదుగా బహూకరించారు. న్యాయ సేవా సంస్థ అధికారి పగిడిపల్లి రాము, అమ్మ ప్రేమ ఆదరణ సేవాసంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ట్రెజరర్ పి.నాగరాధిక, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర, పీఎల్‌వీ సాల్మన్ జయకుమార్, యశోద, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి బాలకోటేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): గృహ హింస చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి డి.బాలకోటేశ్వరరావు అన్నారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద గల ఓ హోటల్‌లో శనివారం గృహహింస చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా దిశ చట్టం ద్వారా యువతులకు భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చితే గృహ హింస, మహిళలపై వేధింపులు తగ్గాయని తెలిపారు. ఆధునిక సమాజంలో ఆడపిల్లలు విద్యావంతులుగా తమ ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. దీంతో మహిళలకు చట్టాలపై సైతం అవగాహన పెరిగిందన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ కె.సత్యవతి, ఎల్.ఎస్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ ప్రభాకరరావుకు నివాళి

విజయవాడస్పోర్ట్స్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఎస్ఐ దేవరపల్లి ప్రభాకరరావు మృతదేహానికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు నివాళులర్పించారు. విజయవాడ నగరంలోని ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభాకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈ నెల 23న మరణించారు. ఆయన మృతదేహాన్ని డీసీపీ సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25 వేల నగదును ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభాకరరావు నగరంలోని సత్యనారాయణపురం, వన్‌టౌన్, ఇబ్రహీంపట్నం, గవర్నర్‌పేట స్టేషన్‌లలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకరరావుకు నివాళులర్పించిన వారిలో ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య ఉన్నారు.